


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  శుక్రవారం 22-05-2026  సంపుటి : 07  సంచిక 350  పేజీలు : 8  వెల : రూ 3-00


# ఏపీకి భారీ పారిశ్రామిక వరం..



ఢిల్లీ, మే 21 : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం భారీ పారిశ్రామిక ప్రాజెక్టును ప్రకటించింది. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల వ్యయంతో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర నౌకాశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. ఈ నెల్లోనే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ఆమోదం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. దుగరాజపట్నం వద్ద ఈ మెగా నౌకా నిర్మాణ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. తిరుపతి, నెల్లూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో విస్తరించనున్న ఈ ప్రాజెక్టు కోసం సుమారు 3,488 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించనుంది. ఈ క్లస్టర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దేశంలోనే అతిపెద్ద నౌకా నిర్మాణ కేంద్రంగా ఏపీ నిలిచే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. నౌకల తయారీతో పాటు భారీ స్థాయిలో షిప్ రిపేర్, మెయింటెనెన్స్ సదుపాయాలు కూడా ఇందులో ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో ఏపీలో సరికొత్త

## దుగరాజపట్నంలో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్

పారిశ్రామిక విప్లవం ప్రారంభమవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా స్టీల్, మెరైన్ ఇంజనీరింగ్, విడిభాగాల తయారీ, పోర్ట్ లాజిస్టిక్స్ రంగాల్లో వందలాది అనుబంధ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ నౌకాయాన సంస్థలు కూడా ఈ క్లస్టర్ వైపు ఆకర్షితమయ్యే అవకాశముందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. భారీ విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉండటంతో ఏపీ పారిశ్రామిక రంగానికి ఇది కీలక మలుపుగా మారనుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన 'పోర్ట్ ఆధారిత వృద్ధి' ఆలోచనలకు ఈ ప్రాజెక్టు పెద్ద ఊతమివ్వనుంది. తీర ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది బలాన్నిస్తుంది. అలాగే రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ప్రతిపాదించిన దుగరాజపట్నం పోర్టు ప్రాజెక్టుకు బదులుగా మరింత భారీ స్థాయిలో ఈ మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం విశేషం. 2047 నాటికి భారత్‌ను ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈ అడుగు వేస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశ నౌకాశ్రయ, సముద్ర పారిశ్రామిక రంగంలో కీలక హబ్‌గా ఎదిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఉచిత ఇసుక పాలసీ ని పటిష్ఠంగా అమలుచేస్తున్నాం

**గనుల రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం**

**అక్రమ మద్యం నియంత్రణ, కల్తీ మద్యం నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాం**

**రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది**

**రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర**

కర్నూలు, మే 21: రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ ని పటిష్ఠంగా అమలుచేస్తున్నామని, గత రెండేళ్లుగా ప్రజలకు ఇసుక అందించడం లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖల అధికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిపాలన చేయాలన్న లక్ష్యంతో పని చేస్తోందన్నారు. అపారమైన ఖనిజ సంపద ఆంధ్ర రాష్ట్రంలో ఉందని, ఈ వనరుల ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయం , ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ మేరకు ప్రభుత్వం వచ్చిన వెంటనే సాండ్ పాలసీ మైనింగ్ పాలసీ,



ఎక్సైజ్ పాలసీ లను అమలు చేయడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక పాలసీ అమలు అస్తవ్యస్తంగా జరగడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఔటు లో కేసులు పడ్డాయని, అధికారులు కోర్టులకు వెళ్లవలసి వచ్చిందని తెలిపారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్రీ సాండ్ పాలసీ అమలు చేసిందని, ఈ రెండు సంవత్సరాలు కూడా ఎక్కడా ఇబ్బంది రాకుండా పర్యవేక్షించి లబ్ధిదారునికి తక్కువ ధరకే ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రూ. 202 రూపాయలకే ఇసుక అందిస్తున్నామని, రవాణా దూరాన్ని బట్టి చార్జెస్ చేయడం జరుగుతుందని తెలిపారు.. వర్షాకాలానికి ముందే సరిపడా ఇసుక నిలువలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో దాదాపు 250 కోట్ల పైనే ప్రజల మీద భారం పడకుండా ప్రభుత్వం ప్రజలకు ఇసుక అందజేసిందన్నారు. ఇసుక సరఫరాలో ఏదైనా ఇబ్బందులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, ఏదైనా తప్పులు చేస్తే సీరియస్ యాక్షన్ తీసుకోవడం జరుగుతోందని మంత్రి తెలిపారు. అలాగే మైనింగ్ రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం 30% గ్రోత్ మైనింగ్ రంగంలో తీసుకొని వచ్చా మన్నారు. జిల్లాలో జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ఆపరేషన్ లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇదే కాకుండా మరో రెండు, మూడు ఐడెంటిఫై చేశామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్రానికి ఆదాయం తెచ్చే విధంగా ఉంటుందన్నారు. అలాగే ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో ప్రత్యేకంగా ఒక పాలసీ తీసుకువచ్చామన్నారు. నవోదయ 2.0 ద్వారా నాటు సారా నిర్మూలన పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎల్సిడి లిక్కర్ లేకుండా చేశామని తెలిపారు. ఈరోజు అతి తక్కువ ధరకే రూ.99 కే లిక్కర్ తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. కల్తీ మద్యం లేకుండా దాదాపుగా ఐదు ప్రాంతాల్లో ల్యాబ్స్ పెట్టి 13 రకాల పరీక్షలు చేసి, ప్రజల ఆరోగ్యం గురించి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సురక్ష యాప్ తీసుకొని వచ్చామని, ఇప్పటివరకు ఒక్క బాటిల్ కూడా ఎక్కడ ట్రేస్ కాలేదని, డిస్టిలరీ ల నుంచి, డిపోల దగ్గర నుంచి, షాప్ దగ్గర నుంచి శాంపుల్స్ ఎప్పటికప్పుడు తెప్పించి టెస్టులు చేసి ఎక్కడ కూడా కల్తీ జరగకుండా చేయడం జరిగిందని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ అని కూడా బలోపేతం చేశామని, వీటి ద్వారా క్రైమ్ కంట్రోల్ చేయడం జరుగుతోందని మంత్రి తెలిపారు. కొంతమందిపై పీడి యాక్ట్ కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# గుడ్ న్యూస్.. నాలుగు యూసీఎఫ్ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,990.83 కోట్ల విలువైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్(జఅఈ) ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ మేరకు నాలుగు కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. యూసీఎఫ్ ద్వారా ఈ ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.497.71 కోట్ల ఆర్థిక సహాయం అందించనుందని మంత్రి పేర్కొన్నారు. విశాఖపట్నం, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ఏపీకి గొప్ప గుర్తింపు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. సాధారణ మున్సిపల్ పనులకు మించి ఆధునిక పట్టణాభివృద్ధిపై ఫోకస్ పెట్టాం. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మురుగునీటి శుద్ధిపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖ, మంగళగిరి-తాడేపల్లిలో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. పట్టణాల్లో కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముందుగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు.



ఈ మేరకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అవకాశాన్ని ఏపీ పూర్తిస్థాయిలో వినియోగించుకుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ పట్టణ మౌలిక వసతుల రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. పట్టణాభివృద్ధిలో దేశానికి ఆంధ్రప్రదేశ్ మోడల్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. కాగా, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, నగరాల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ని ఏర్పాటు చేసింది. పట్టణాలను ఆర్థికవృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడం, అలాగే ప్రైవేట్ లేదా మార్కెట్ పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశంతో కేంద్రం ఈ ఫండ్‌ని కేటాయించింది.

# పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై కేంద్ర కేబినెట్ కీలక చర్చ

ఢిల్లీ, మే 21 ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సాయంత్రం 5 గంటలకు కేంద్ర మంత్రిమండలి సమావేశం ప్రారంభమైంది. అయితే, 11 నెలల తర్వాత కేంద్ర కేబినెట్ సమావేశమైంది. జూన్ 9వ తేదీకి మోదీ ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకుంటున్న విషయం తెలిసిందే. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధానంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరుతున్న సేవలు, వివిధ పథకాల అమలు స్థితి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రభావంపై



మంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్షించనున్నారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి కీలక ప్రాజెక్టుల అమలు వేగం, పెట్టుబడుల పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రివర్గంతో ప్రధాని చర్చించనున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీస్తున్న పశ్చిమాసియా సంక్షోభంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, చమురు ధరల మార్పులు, వాణిజ్యంపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షిస్తున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలను ప్రధాని ముందు ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మరింత సమర్థవంతమైన అమలుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

# తాగునీటి నాణ్యతపై రాజీ పడొద్దు..

**అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు**

అమరావతి, మే21 : తాగునీటి నాణ్యతపై రాజీపడొద్దని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు(గురువారం) సచివాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై డిప్యూటీ సీఎం చర్చించారు. నెల రోజుల్లోగా ఫిల్టర్ బెడ్ల క్లీనింగ్ పూర్తి కావాలని సూచించారు. పనులు పూర్తయ్యేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. గృహ అవసరాలకూ పూర్తి స్థాయిలో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని నిర్దేశించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి నాణ్యత పరిశీలనకు ఎఫ్‌టీకే కిట్లను ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను పెంచడానికి, ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రతి పంచాయతీలో ఉన్న ఫిల్టర్ బెడ్లను నెలరోజుల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ తాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై స్వయంగా ప్రతి నెల ప్రత్యేకంగా సమీక్షిస్తామని తెలిపారు. పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించొద్దని ఆదేశించారు. ప్రభుత్వం ఆమోదించిన మరో 7 మల్టీ విలేజ్ స్కీమ్స్ తాగునీటి పనులకు సంబంధించిన ముందస్తు ప్రక్రియలను తొందరగా పూర్తి చేసి, వెంటనే వాటిని క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని పవన్ కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు.




# సంపాదకీయం

శుక్రవారం 22-05-2026

## ట్రంప్ అధికారాలకు కత్తెర

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్రానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమీనియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ ర్గి÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి.

# హాస్టల్లో వివాదం.. దాడులు

**హాస్టల్ నిర్వాహకులపై భవన యజమానుల దాడులు**

**స్థానికులతో పెట్టుకుంటావా అంటూ పిడిగుద్దులు**

**అక్రమ నిర్మాణంలో కొనసాగుతున్న హాస్టల్స్ పై స్థానికుల ఆవేదన**

**రోడ్లపైనే వందలాది వాహనాలులక్షల్లో అద్దెలు**

అగ్రిమెంట్లకు విరుద్ధంగా ఖాళీ చేయాలంటూ న్యాయస్థానాలకు మహానగరంలో హాస్టల్ల వ్యాపారం కోట్లలో సాగుతుంది. ఉన్నత చదువుల కోసం వృత్తిరీత్యా, నైపుణ్యాల శిక్షణ కోసం హైదరాబాద్ మహా నగరానికి వస్తున్న వారికి ఆశ్రయం కల్పిస్తున్న హాస్టల్స్ నిత్యం వివాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. జిహెచ్ఎంసి నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మాణం చేసి హాస్టల్ కు అద్దెకిస్తున్నారు. ఉమెన్స్ హాస్టల్ లో కనీస ప్రమాణాలు పాటించకపోవడం తో ఆయా హాస్టల్లో ఉంటున్న మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. ఇక భవన యజమానులు, హాస్టల్ నిర్వాహకుల మధ్య నిత్యం ఏదో ఒక విషయంలో వివాదం జరగడం సర్వసాధారణం అయిపోయింది. లక్షల అద్దెలకు ఆశపడి భవన యజమానులు వారి భవనాలను హాస్టలకు ఇస్తున్నారు. స్థల యజమానులు హాస్టల్ నిర్వాహకుల నుంచి కోట్లల్లో డబ్బులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం వారు ఇచ్చే డబ్బులు పూర్తి అయ్యేవరకు హాస్టల్ కొనసాగించే అవకాశం ఉన్న కొంతకాలానికి ఏదో ఒక రూపంలో వివాదం చేసి హాస్టళ్లను స్వాధీనం పరుచుకునేందుకు జరుగుతున్న ఘర్షణ దాడులకు దారి తీస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇక నివాస ప్రాంతాలలో హాస్టలను ఏర్పాటు చేయడంతో విసిగిపోతున్నట్లు చెబుతున్నారు స్థానికులు. రోడ్లపైనే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఏమీ అనలేని పరిస్థితి వచ్చిందని తీవ్ర మనోవేదన గురవుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలలో అడ్డుకోవాల్సిన పోలీసులు భవన యజమానుల అండదండలతో చెలరేగిపోతున్న హాస్టల్ నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శిస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన జిహెచ్ఎంసి భవన యజమానులు ఇచ్చే తైలాలకు లొంగి 50 గజాల కూడా లేని స్థలాలలో సైతం ఆరు నుంచి ఏడు అంతస్తులు నిర్మిస్తున్న పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అమీర్పేట హాస్టల్ వివాదం సైతం ఈ తరహాలో జరిగినట్లు తెలుస్తుంది. స్థల యజమాని హాస్టల్ నిర్వాహకుల నుంచి రెండు కోట్లకు పైగా డబ్బులు తీసుకొని అవి పూర్తయ్య వరకు నిర్వహించుకోవచ్చునని హామీ ఇచ్చారు. అనంతరం ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం కోర్టుకు చేరింది. నిబంధనల ప్రకారం ప్రస్తుతం కోర్టుకు హాస్టల్ నిర్వాహకులు డబ్బులు చెల్లిస్తున్నారు. ఇది ఇలా ఉండగా హాస్టల్ నిర్వాహకులను ఖాళీ చేయించేందుకు మాజీ మేయర్ కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు అందులో భాగంగానే తమపై అక్రమ కేసులు బలాయిస్తున్నారని హాస్టల్లో వాపోయారు. సివిల్ వివాదాన్ని క్రిమినల్ వివాదంగా మార్చి తమను బలవంతంగా అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటుండగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నందునే ఖాళీ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ వివాదం కొనసాగుతుండగా బుధవారం రాత్రి తమ హాస్టల్ లోకి అక్రమంగా చొరబడ్డ మహిళలు తమపై దాడి చేశారని హాస్టల్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం గాయపడ్డ వారు ప్రైమ్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారని తెలిపారు.

# ఈ 25న జరిగే నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు**

జూలూరుపాడు, మే 21 : భవన నిర్మాణ కార్మికుల సుదీర్ఘ కాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న రాష్ట్ర లేబర్ కార్యాలయం ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ?ఈ సందర్భంగా ఏదులాపురం గోపాలరావు మాట్లాడుతూ.. 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.9 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఇతర పథకాల అమలులో ప్రైవేట్ ఏజెన్సీల రెన్యువల్ పద్ధతిని తక్షణమే నిలిపివేయాలని, ప్రైవేట్ సంస్థలతో నిర్వహించే ఆరోగ్య పరీక్షలను రద్దు చేసి కార్మికులందరికీ ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, రైతాంగం మాదిరిగానే భవన నిర్మాణ కార్మికులకు కూడా సహజ మరణానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం ప్రకటించాలని



ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ, తీవ్రమైన వేసవి ఎండల దృష్ట్యా లేబర్ అడ్డాలలో కార్మికులకు నీడ కోసం షెల్టర్లు, సురక్షితమైన మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై రాష్ట్ర లేబర్ కార్యాలయం ముందు జరిగే ప్రదర్శన, ధర్నా కార్యక్రమంలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు ఏదులాపురం రాజు, పొరండ్ల కనకమ్మ, రాజమ్మ, నాగరత్నమ్మ, లలిత, భవాని, పట్టా ప్రసాద్, నర్సమ్మ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియ..

**119 నియోజకవర్గాలకు ఇంచార్జీలు వీరే**

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా అధినేత కేసీఆర్ 119 నియోజక వర్గాలకు ఇంచార్జీలను ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఇంచార్జీలతోపాటు ప్రతీ నియోజకవర్గానికి ఒక్కరు చొప్పున ఐటీ నిపుణులతో కలిపి తెలంగాణ భవన్‌లో డిజిటల్ శిక్షణ ఇవ్వబడుతుంది. ఇప్పటికే ప్రకటించిన మేరకు సభ్యత్వ నమోదుకు సంబంధించిన డిజిటల్ యాప్ మెరుగులు దిద్దుకుంటున్నది. త్వరలో తుది రూపం తీసుకోనున్నది. తెలంగాణ సమాచారంతెలంగాణ భవన్‌లో శిక్షణ అనంతరం, వీరు బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల్లో ఇప్పటికే నియమించబడిన పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇంచార్జీల ఆద్వర్యంలో అన్ని నియోజకవర్గాల వారీగా ఆయా జిల్లా పార్టీ కార్యాలయాలలో శిక్షణ శిభిరాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆయా నియోజకవర్గంలో వున్న బూత్ ల సంఖ్యను బట్టి బూత్‌కు ఇద్దరు చొప్పున నిర్ణయించిన తేదీ నుంచి వారం రోజుల పాటు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు. ఈ



సందర్భంగా శిక్షణకు హాజరైన వారికి భోజన వసతులు కల్పించబడతాయి. ఈ ప్రక్రియలో రాష్ట్ర కమిటీ నుంచి నియమించబడిన ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇంచార్జుల ఆధ్వర్యంలో ఈ మొత్తం వ్యవహారాలను, ఆయా జిల్లాల వారీగా నిర్వహించబడుతుంది. ఈ మొత్తం డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన వెంటనే సభ్యత్వ నమోదు తేదీని ప్రకటిస్తారు. ప్రకటించిన తేదీ రోజు స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్‌తో సహా పార్టీ ముఖ్యులంతా సభ్యత్వ పునరుద్దరణ కార్యక్రమంలో పాల్గొంటారు. తద్వారా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ పునరుద్దరణ, నమోదు ప్రక్రియ మొదలవుతుంది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉండేటటువంటి అన్ని రకాల కమిటీలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. ప్రకటించబడిన నిర్ణీత తేదీలలో కమిటీల నియామకం పూర్తి చేసుకుని పార్టీ శిక్షణా శిబిరాలు నిర్వహించబడతాయి.

# రైతు రాజయ్య మృతికి ప్రభుత్వమే కారణం : పద్మా దేవేందర్ రెడ్డి



శంకరంపేట్ : రైతు రాజయ్య మృతి బాధాకరమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. శంకరంపేట్ మండలం అంబాజీపేట గ్రామానికి చెందిన రైతు రాజయ్య వడ్లు కొనుగోలు కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పద్మా దేవేందర్ రెడ్డి గురువారం మండల నాయకులతో కలిసి గ్రామానికి చేరుకొని రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. అనంతరం మెదక్ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉన్న రాజయ్య మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వడ్లు కొనుగోలు కాకపోవడం, అప్పులు ఎలా తీర్చాలో తెలియక రాజయ్య తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మెదక్ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పట్లోరి రాజు, నాయకులు ప్రభాకర్, పడాల శ్రీనివాస్, మల్లుపల్లి సర్పంచ్ నరేష్,తదితరులు ఉన్నారు.

# కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలి'

**నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**



నీలగిరి, మే 21 : కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, తల్లిదండ్రులు కూడా అందుకు తగ్గట్లుగా పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ? 99 రోజుల యాక్షన్ ప్లాన్'లో భాగంగా 15?18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని గురువారం పానగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్‌లో అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహార లోపం, నెలసరి పరిశుభ్రత వంటి అంశాలపై ప్రతి బాలికకు అవగాహన అవసరమని తెలిపారు. వైద్యులు ఇచ్చే సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర మాట్లాడుతూ.. 15?18 సంవత్సరాల వయస్సు గల బాలికలలో హార్మోన్ల మార్పుల కారణంగా శారీరక, మానసిక సమస్యలు సాధారణమని తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత సమస్య అధికంగా కనిపిస్తోందని, సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్ సాధ్యమవుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తబస్సుం మాట్లాడుతూ.. కౌమార దశలో ఋతుస్రావ సమస్యలు, మొటిమలు, బలహీనత, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. సరైన పోషకాహారం, పరిశుభ్రత, వైద్య సలహాలు పాటించడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. అదేవిధంగా కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే శారీరక, మానసిక, పోషకాహార సంబంధిత సమస్యలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో రక్తహీనత, మధుమేహం, బీఎంఐ పరీక్షలతో పాటు నెలసరి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పీఏసీఎస్ ఛైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, కార్పొరేటర్లు పేర్ల మల్లేశ్వరి, ఆలకుంట్ల ఝాన్సీ, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సిఓలు అనిల్ కుమార్, జ్యోతి, రాజా, నరసింహ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు. మొత్తం 89 మంది కౌమార బాలికలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

## వైభవంగా సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం

భూపాలపల్లి,సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు గురువారం ఉదయం 5.43 గంటలకు పవిత్ర సంగంలో తొలి పుష్కర స్నానం నిర్వహించారు. ఈ పుణ్యస్నానాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు, ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు ఆచరించారు. అలాగే భూపాలపల్లి, రంగారెడ్డి నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి పుష్కర స్నానంలో పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు

# మూడు వస్తే..మూడేది ఎవరికి

విజయవాడ, మే21 రాజకీయాల్లో అవకాశాలు రావు, తీసుకోవాలి. ప్రజలు ఎపుడూ తెలివైన వాళ్ళు. వారికి తామే ఆల్టర్నేషన్ అని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు, ప్రజలు తమదైన చైతన్యంతో తమకు కావాల్సిన ఆల్టర్నేషన్ ని తెచ్చుకుంటారు. గద్దె మీద కూర్చోబెడతారు. దానికి తాజా ఉదాహరణ తమిళనాడు. అక్కడ డీఎంకే ఓడితే అన్నా డీఎంకేనే దిక్కు అనుకున్నారు ఆ పార్టీ నేతలు. కానీ ఫలితాలు వచ్చిన తరువాత సీన్ అర్ధం అయింది మూడవ ప్లేస్ లోకి పడిపోయింది. అంటే జనాల ఆలోచనలు ఎంత వేగంగా మారుతాయన్నది అర్ధం చేసుకోవాలిన అవసరం ఉంది. ఇదే కాదు దేశాన్ని మూడు నాలుగు దశాబ్దాలకు పైగా ఏకచత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీ కూడా చివరికి విపక్షంలోకి రావాల్సి వచ్చింది. ఏపీ లో చూస్తే ప్రస్తుతానికి రాజకీయ వాతావరణం కూటమికి వైసీపీయే ప్రత్యర్ధిగా ఉంది. అదే వైసీపీలో ధీమాను కూడా పెంచుతోంది. కూటమి తప్పులు చేస్తే అధికారం తమకే దక్కుతుందని మెచ్చి వరమాలను తమ మెడలో వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. యాంటీ ఇంకెంబెన్సీ మీదనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మేమే అని చెబుతున్నారు. మరో విషయం ఏమిటి అంటే ఒక పార్టీకి ఒకేసారి అధికారం ఇవ్వడం ఏపీ ప్రజలు చేస్తారు కాబట్టి ఆ ట్రాక్ రికార్డు చూసినా తమకే చాన్స్ అని కూడా వారు విశ్వాసంగా ఉన్నారు.అయితే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది. రాజకీయంగా చూస్తే అది చాలా ఎక్కువ సమయమే. ఎందుకంటే క్షణాలలో అంతా మారే సీన్ పొలిటికల్ గా ఉంటుంది. అలా చూసినపుడు ఈ మూడేళ్ళలో కొత్త పార్టీ వచ్చినా లేక థర్డ్ ఫోర్స్ ఏదైనా ఎమర్జ్ అయినా ఎవరికి ఎక్కువ నష్టం అన్న చర్చ వస్తోంది. సాధారణంగా మూడవ పార్టీ వస్తే కనుక అది ఖాయంగా ప్రతిపక్ష పార్టీకే చేటు చేస్తుంది. దానికి మళ్ళీ అన్నా డీఎంకేని ఉదహరించాల్సి ఉంటుంది. అందువల్ల ఏపీలో కూడా వైసీపీకే దెబ్బ పడుతుందని అనే వారూ ఉన్నారు. ఏపీలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం పాలనలో అసంతృప్తి ఉంది. అయితే అది ఏ మేరకు అన్నది తెలియడం లేదు కానీ అధికారంలో ఉన్న పార్టీకి సహజం. కానీ ఆ అసంతృప్తి వైసీపీ వైపు మళ్ళడం లేదు.

అంటే వైసీపీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓట్లు అలా నికార్సుగా నిలిచి ఉన్నాయో లేవో తెలియడం లేదు కానీ కొత్త ఓట్లు అయితే జత చేరడం లేదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీని వీడిన వారు ఉన్నారు, కూటమిలో చోటు లేని వారు ఉన్నారు. ఇంకా అన్ని పార్టీల తీరు చూసి కొత్తదనం కోసం ఆలోచిస్తున్న వారు ఉన్నారు. వీరందరి కోసం ఏదైనా పార్టీ వచ్చినా లేక ఫోర్స్ గా అందరూ కలిసి ప్రయత్నం చేసినా అపుడు ఏమిటి జరుగుతుంది అన్నది ఒక కీలకమైన చర్చ. అలాంటి సందర్భాలలో కచ్చితంగా వైసీపీకి ఇబ్బంది అవుతుందని అంటున్నారు. వైసీపీ అయితే రెండేళ్ళ కాలంలో జనంలోకి పెద్దగా వచ్చింది లేదు. ఇక అసెంబ్లీ ముఖం ఎమ్మెల్యేలు చూసింది అంతకంటే లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చే ప్రయత్నం చేయడం లేదు. దాంతో తమ గొంతుకని విపక్షం వినిపించలేకపోతోంది అన్న భావన అయితే మెల్లగా జనంలోకి వెళ్తోంది. సరిగ్గా ఈ సమయంలో సర్దుకుని వైసీపీ దూకుడుగా ముందుకు సాగకపోతే మాత్రం మూడవ పార్టీ అయినా లేదా శక్తి అయినా వస్తే మాత్రం ఆ పార్టీ విజయావకాశాలనే దెబ్బ తీస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. చూడాలి మరి ఏపీ రాజకీయాల్లో ఏ మార్పులు వస్తాయో.

## కోస్తాజిల్లాల్లే వైసీపీ టార్గెట్



విశాఖపట్టణం, మే 21 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం మరోసారి ప్రధాన చర్చగా మారుతోంది. ముఖ్యంగా జనసేన పార్టీ ఏర్పాటైన తర్వాత కాపు వర్గంలో రాజకీయంగా కొత్త మార్పులు కనిపించాయి. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో పాటు తమ సమస్యలను ప్రస్తావించే వేదికగా జనసేనను భావించే వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ కారణంగా గత కొన్నేళ్లుగా కాపు వర్గం పెద్ద ఎత్తున జనసేనకు మద్దతుగా నిలుస్తోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.ఈ పరిస్థితి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి రాజకీయంగా సవాలుగా మారిందనే చర్చ కొనసాగుతోంది. కాపు వర్గం ఒకే దిశలో నిలిస్తే భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వర్గాన్ని రాజకీయంగా తటస్థంగా మార్చేందుకు వైసీపీ వ్యూహాలు సిద్ధం చేస్తోందనే ప్రచారం జరుగుతోంది.ఇటీవల వరకు కూటమి రాజకీయాలపై వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మధ్య విభేదాలు వస్తాయని సోషల్ మీడియా వేదికలతో పాటు బహిరంగ సభల్లో కూడా వ్యాఖ్యలు వినిపించాయి. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం కూటమి కొనసాగుతుందని, వ్యక్తులు మారినా లక్ష్యం మారదని స్పష్టం చేశారు. దీంతో కూటమిలో చీలికలు సృష్టించే ప్రయత్నాలు ఫలించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కాపు వర్గాన్ని మళ్లీ ఉద్యమాల దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాపు రిజర్వేషన్లు, సామాజిక హక్కులు, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలను మళ్లీ ప్రస్తావనలోకి తీసుకురావాలనే ఆలోచన కొంతమంది నేతల్లో ఉందని చెబుతున్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో కాపు ఉద్యమం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చగా నిలిచింది. ఆ సమయంలో రిజర్వేషన్ల కోసం ఆందోళనలు కూడా జరిగాయి.అయితే తర్వాత పరిస్థితులు మారిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు ఉద్యమం నెమ్మదించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తమ తరఫున పోరాడతారనే నమ్మకం కాపు వర్గంలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇదే అంశం ఇప్పుడు వైసీపీకి ఇబ్బందిగా మారిందనే ప్రచారం కూడా జరుగుతోంది.దీంతో కాపు వర్గంలో మళ్లీ భిన్న అభిప్రాయాలు వచ్చేలా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారనే చర్చ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో కొన్ని వర్గాలతో చర్చలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేలా ఉద్యమాలను ప్రోత్సహించే వ్యూహం అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.అయితే ఈ ప్రచారాలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. కానీ కాపు వర్గం రాజకీయంగా ఎటు వైపు నిలుస్తుందన్నది భవిష్యత్ ఎన్నికల్లో కీలక అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కాపు ఓటు బ్యాంక్ చుట్టూనే అనేక వ్యూహాలు తిరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది.

## కార్యకర్తలతోనే జగన్ ఫేస్ టూ ఫేస్

విజయవాడ, మే 21 వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎందుకు ఓటమి పాలు అయ్యామో గురించించారు. పార్టీని సొంతం అనుకుని తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా 2019 ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు 2024 నాటికి పూర్తిగా గాలికి వదిలేశారు అన్నది బాగా ప్రచారంలో ఉంది. అందులో నిజం ఉందని వైసీపీ హైకమాండ్ కూడా భావిస్తోంది. అందుకే జగన్ కార్యకర్తలకు వైసీపీ 2.0 ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని ఇప్పటిదాకా చెబుతూ వస్తున్నారు. ఇపుడు ఆయన నేరుగా ప్రతీ నియోజకవర్గంలోని కార్యకర్తలతో నేరుగా భేటీ వేస్తారు అని ప్రచారం సాగుతోంది. అది ఎపుడూ ఏమిటి అన్నది తెలియదు కానీ కార్యకర్తలతో అధినేత ముఖా ముఖీ సమావేశం అవుతారు అని అంటున్నారు. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జిలను నియమించింది. అక్కడ నుంచి మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాలు వార్డులు ఇలా బూత్ లెవెల్ దాకా కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆదేశించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ అయితే జోరుగా సాగుతోంది అని అంటున్నారు. ఇది పూర్తి కాగానే ప్రతీ కార్యకర్తకు పార్టీ తరఫున ఐడెంటిటీ కార్డు ఇస్తారని అంటున్నారు. ఆ విధంగా కార్యకర్తలు ఈ ఐడెంటిటీ కార్డుల ద్వారా నేరుగా జగన్ తో మమేకం అయ్యేలా పార్టీ నిర్మాణం చేపడుతున్నామని నేతలు చెబుతున్నారు

## అనంతలో తమ్ముళ్ల మధ్య లుకలుకలు

అనంతపురం, మే21 ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అంతర్గత రాజకీయాలు రోజురోజుకు చర్చనీయాంశంగా మారుతున్నాయి. పార్టీ అధిష్టానం నాయకులంతా కలిసి పనిచేయాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో మాత్రం వర్గపోరు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల నియామకాల తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు మరింత స్పష్టంగా బయటపడుతున్నాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీశాయి. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పల్లవి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలు కనిపిస్తున్నాయి. మొదట్లో ఆమె సిట్టింగ్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కు సన్నిహితంగా వ్యవహరించారని, ఆ కారణంగానే ఆమెకు పదవి లభించిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపించింది.అయితే తరువాత పరిస్థితులు మారిపోయాయి. కొన్ని వ్యవహారాల్లో ఎమ్మెల్యేకు, చైర్‌పర్సన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్టు ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తో పల్లవి దగ్గరయ్యారనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. దీంతో స్థానికంగా రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం మరింత పెరిగిందని అంటున్నారు.ఈ పరిణామాలను గమనించిన ఎమ్మెల్యే వర్గం మార్కెట్ యార్డ్ కమిటీలోని ఇతర సభ్యులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కమిటీ కార్యకలాపాలు కూడా రెండు వర్గాల ప్రభావంతో సాగుతున్నాయని చెబుతున్నారు. సభ్యులు, చైర్‌పర్సన్ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమావేశాలు, కార్యక్రమాలు కూడా సక్రమంగా జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికే ఇష్టపడని పరిస్థితి ఏర్పడిందని స్థానిక నేతలు అంటున్నారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అధికారికంగా ఆయన ఎలాంటి ప్రకటన చేయకపోయినా, తన అనుచరులతో సమావేశాలు నిర్వహించడం, స్థానికంగా అసంతృప్తిగా ఉన్న నేతలను దగ్గర చేసుకోవడం వంటి పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన ఆయనకు అవకాశం రాకపోవడం, తర్వాత నామినేటెడ్ పదవి కూడా దక్కకపోవడం ఆయన వర్గంలో అసంతృప్తిని పెంచిందని భావిస్తున్నారు.ఈ పరిస్థితులు ఎమ్మెల్యే వర్గానికి అసహనాన్ని కలిగిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు రోజు రోజుకూ తీవ్ర రూపం దాలుస్తుండటంతో పార్టీ కార్యకర్తలు కూడా అయోమయంలో పడుతున్నారని అంటున్నారు. సీనియర్ నేతలు ఇప్పటివరకు జోక్యం చేసుకోకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు.ఈ అంతర్గత విభేదాలు భవిష్యత్తులో పార్టీపై ప్రభావం చూపే అవకాశముందని స్థానికంగా చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం సమయానికి స్పందించి నాయకుల మధ్య సమన్వయం తీసుకురా కపోతే ఎన్నికల సమయానికి సమస్య మరింత పెద్దదయ్యే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు

## కాకినాడ నుంచే వర్మ రాజకీయం

కాకినాడ, మే 21 పిఠాపురం రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ నేత పిఠాపురం వర్మ అలియాస్ ఎస్వీఎస్ఎన్ వర్మపేరు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. 2024 ఎన్నికల సమయంలో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడం అప్పట్లో పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించడంతో వర్మకు టికెట్ అవకాశాలు ముగిశాయి.అప్పుడు పార్టీ పెద్దలు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని వర్మ అనుచరులు భావించారు. అయితే ఆ హామీ అమలు కాలేదని వారు ఇప్పుడు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వర్మకు ఉన్న నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు కూడా తొలగించడంతో ఆయన వర్గం మరింత నిరాశకు గురైంది.



ఆ పరిణామాల తర్వాత వర్మ కాకినాడ కు వెళ్లి అక్కడే ఉంటున్నారు. అయితే రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటారని అనుకున్న సమయంలో కొత్త పరిణామాలు కనిపిస్తున్నాయి. పిఠాపురం ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాకినాడలోని వర్మ నివాసానికి వెళ్లడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. గ్రామ స్థాయి నాయకుల నుంచి కీలక నేతల వరకు చాలామంది ఆయనను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారని సమాచారం.పిఠాపురం పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు వర్మకు ధైర్యం చెబుతూ ఆయన ఇంకా తమ నాయకుడేనని చెబుతున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలు నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులను కూడా ఆయనకు వివరిస్తున్నారని అంటున్నారు. దీంతో వర్మ పరోక్షంగా అయినా పిఠాపురం రాజకీయాలపై దృష్టి కొనసాగిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇదే అంశం ఇప్పుడు జనసేన వర్గాల్లో అసహనానికి కారణమైందని సమాచారం. ఇంచార్జి బాధ్యతలు లేని పరిస్థితిలో కూడా వర్మ నియోజకవర్గ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించడం సరైన విధానం కాదని కొందరు జనసేన నాయకులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. కూటమి ధర్మానికి ఇది విరుద్ధమని కూడా వారు వ్యాఖ్యానిస్తున్నారట.అయితే తనను కలవడానికి వచ్చే నాయకులను తాను ఆపలేనని వర్మ చెబుతున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు అభిమానంతో వస్తుంటే వారిని నిరాకరించడం ఎలా సాధ్యమవుతుందని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ క్యాడర్ తనతోనే ఉందని ఆయన వర్గం కూడా ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే కాకినాడలో వర్మను కలిసేందుకు వస్తున్న నాయకుల సంఖ్య పెరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై టీడీపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన వర్గాలు మాత్రం ఈ వ్యవహారంపై అసంతృప్తితో ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## వేడెక్కిన ధర్మవరం రాజకీయాలు

అనంతపురం, మే21 ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రభుత్వ విమర్శకులను, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారంటూ మంత్రి సత్యకుమార్‌పై సొంత పార్టీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. “సత్యకుమార్.. నీకు దమ్ముంటే నీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లోకి రా” అంటూ ధర్మవరం స్థానిక నాయకులు సవాల్ విసరడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.ఈ తాజా రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఒక దాడి ఘటన. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన హైకోర్టు న్యాయవాది కె. అంజన్ రెడ్డిపై మంత్రి వ్యక్తిగత సహాయకుడుహరీష్, అనుచరులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజన్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రశ్నించే వారిపై ఇలా దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమని స్థానిక నేతలు మండిపడుతున్నారు.ఈ ఘటనకు నిరసనగా ధర్మవరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ఏకమై భారీ ధర్నా చేపట్టారు. నిరసనలో పాల్గొన్న బీజేపీ నేత సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నేత పరమేష్ మాట్లాడుతూ.. సత్యకుమార్ ఒక బ్రోకర్ లా వ్యవహరిస్తున్నారని, అనంతపురంలో కలకలం రేపిన ‘హనీ ట్రాప్’ స్కామ్ వెనుక ఆయన హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి అండతోనే ధర్మవరంలో రౌడీయిజం పెరుగుతోందని, బాధితుడికి న్యాయం జరిగే వరకు మంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు.

## భూమా మౌనికకు దారేది...

కర్నూలు, మే 21,భూమా మౌనిక రెడ్డి రాజకీయ అరంగేట్రం ఖాయం అని తేలిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా సినీ నటుడు ఆమె భర్త మంచు మనోజ్ వెల్లడించారు. భూమా మౌనికా రెడ్డికి రాజకీయాలు కొత్త కాదని ఆయన చెప్పుకొచ్చారు. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి వారసురాలిగా ఆమె భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నారు అని మనోజ్ సంచలన ప్రకటన చేశారు. దీంతో రాయల సీమ రాజకీయాలతో పాటు కర్నూల్ ఆళ్ళ రాజకీయాల్లో కొత్త చర్చ వేడిగా వాడిగా రాజుకుంటోందివిషయానికి వస్తే భూమా కుటుంబానికి కర్నూలు జిల్లాలో ఎంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయో అందరికీ తెలిసిందే. రాజకీయంగా ఆ కుటుంబం జిల్లాలో కీలక పాత్ర పోషించింది. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి దంపతులు రాజకీయాల్లో తమదైన శైలిలో ప్రాధాన్యతతో కూడిన పాత్ర పోషించారు. వారు దివంగతులు కావడంతో ఆ కుటుంబంలో బిడ్డలు ఇపుడు రాజకీయంగా తమ అవకాశాల కోసం ఎవరి ప్రయత్నాలలో వారు ఉన్నారు. ఇప్పటికే భూమా నాగిరెడ్డి దంపతుల రాజకీయ వారసురాలిగా రంగ ప్రవేశం చేసిన అఖిల ప్రియ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు..గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆళ్ళగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున ఉంటూ గట్టి పట్టు సాధించారుఇదిలా ఉంటే భూమా నాగిరెడ్డి దంపతుల రెండవ కుమార్తె మౌనిక రెడ్డి ఇప్పుడు రాజకీయాల వైపు చాలా ఆసక్తిగా చూస్తున్నారు అని అంటున్నారు. మంచు మనోజ్ ఈ విషయాని ధృవీకరించడంతో పాటు మౌనికా రెడ్డిది రాజకీయ కుటుంబమే అని స్పష్టం చేయడంతో భూమా మౌనిక రెడ్డి రాజకీయానికి తెర లేచినట్లు అయింది. భూమా కుటుంబంలో ఇద్దరు ఆడబిడ్డలు ఒక సోదరుడు రాజకీయ వారసత్వం విషయంలో పోటీ పడే పరిస్థితి వచ్చిందా అన్న చర్చ కూడా ఉంది. అయితే అఖిలప్రియకు గతంలో మౌనికా రెడ్డి రాజకీయంగా అండగా నిలిచి ఆమె విజయం వెనక ఉన్నారు. ఇక వారి సోదరుడు జగద్విఖ్యాత రెడ్డి కూడా అఖిలప్రియ వెంట ఉన్నారు. మౌనికా రెడ్డి రాజకీయాల్లోకి వస్తే ఆమె దారి ఏ వైపు అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఇక భూమా మౌనిక రెడ్డి రాజకీయంగా తన సొంత దారిలో వెళ్తారా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఆమెకు మంచు మనోజ్ పూర్తి మద్దతుగా నిలుస్తారని చెబుతున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ దంపతులు ప్రజల మన్నన పొందుతున్నారు. రాజకీయాలు పట్ల ఆసక్తి కూడా ఉన్నట్లుగా ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా తన సతీమణి రాజకీయ రంగ ప్రవేశం మీద తాజాగా కీలక వ్యాఖ్యలే చేశారు. దాంతో ఆమె ఎక్కడి నుంచి పోటీ చేస్తారు, ఏది పార్టీ నుంచి చేస్తారు, ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా ఇవన్నీ చర్చకు దారి తీస్తున్నాయిఇక భూమా కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోనూ వైసిపితోనూ ప్రజా రాజ్యంతోనూ సంబంధాలు ఉన్నాయి. భూమా దంపతులు ఈ మూడు పార్టీల నుంచి ప్రజా ప్రతినిదులు అయ్యారు. దాంతో తెలుగుదేశంలో అక్క అఖిలప్రియ రాజకీయంగా స్థిరపడినందున మౌనికా రెడ్డి వేరే ప్రత్యామ్నాయులు చూసుకుంటారా అన్న చర్చ కూడా సాగుతోంది. ప్రజారాజ్యంలో భూమా దంపతులు పనిచేసిన కారణంగా జనసేనలో ఏమైనా అవకాశం సంపాదించి అక్కడ నుంచి పోటీ చేస్తారా అన్నది కూడా మరొక చర్చగా ఉంది. ఏది ఏమైనా భూమా మౌనిక రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం మాత్రం కర్నూలు జిల్లా రాజకీయాల్లో కొత్తగా సంచలన కలిగించే అవకాశం ఉంది. అక్క చెల్లెలు ఇద్దరూ సర్దుబాటు రాజకీయంగా ముందుకు సాగుతారా లేక ఎదురు బొదురు నిలిచి పోటీ చేస్తారా, అది కూడా వేరు వేరు పార్టీ నుంచి రాజకీయంగా ముందుకు వస్తారా అన్నది సైతం చూడాల్సి ఉంది. భూమా కుటుంబ వారసత్వం ఎవరిది అన్న ప్రశ్నకు జవాబుగా అఖిల ప్రియా ఉన్నారు. మరి పోటీగా మౌనిక రెడ్డి వస్తే మాత్రం రాజకీయం ఆళ్లగడ్డ నుంచి కర్నూలు జిల్లా వరకు రసకందాయంలో పడే అవకాశం ఉందని చెప్పక తప్పదు.



